**కథ**

# తల్లి బాధ్యత

**ఎస్.ఇందిరా నాగేశ్వర్**

**శ్వేత స్కూలు నుంచి హడావుడిగా వచ్చింది. వచ్చేటప్పుడు బజారు నుంచి తెచ్చిన స్వీట్సు, హాట్సు, పళ్ళు వంటింట్లో పెట్టింది.**

**"వాళ్ళు వచ్చే టైమైంది. త్వరగా తయారవ్వ"మని తల్లి తొందరపెడ్తుంటే గబగబా బాత్‌రూమ్ వైపు నడిచింది. కాసేపట్లో శ్వేతకి పెళ్ళిచూపులు. అందుకే ఈ హడావుడి.**

వర్ధనమ్మకు శ్వేత ఒక్కతే సంతానం. శ్వేత చంటిపిల్లప్పుడే ఆమె భర్త చనిపోయాడు. అప్పటికే ఆమె ఎలిమెంట్రీ స్కూల్లో టీచర్‌గా చేస్తోంది. ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని కూతుర్ని ఇంతదాన్ని చేసింది. కూతుర్ని బిఎస్‌సి, బిఇడి చేయించి టీచర్‌ని చేసింది. పెద్దవయసు వచ్చాక ఆరోగ్యం బావుండక వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంది. వచ్చిన డబ్బుతో శ్వేతకు కట్నంగా ఇవ్వవచ్చని చిన్న ఇల్లు కట్టించింది. శ్వేతకి పెళ్ళి చేసేసి తన బాధ్యతలు తీర్చుకోవాలని తనకొచ్చే పెన్షనుతో ఏ ఆశ్రమంలోనో చేరి కాలక్షేపం చేస్తానని అంటుంది ఆవిడ. శ్వేత దీనికేమాత్రమూ అంగీకరించడం లేదు.

"నా పెళ్ళిచేసి నువ్వు ఆశ్రమానికి వెళ్ళిపోవడమేమిటి? నువ్వు కూడా నాతోనే ఉండాలి. అలాగైతేనే పెళ్ళి, లేకపోతే నాకసలు పెళ్ళే వద్దంటుంది" శ్వేత.

"నువ్వేమైనా మగపిల్లవాడివా? తల్లి బాధ్యత తలకెత్తుకోవడానికి" అంటుంది ఆవిడ.

"ఈరోజుల్లో ఆడేమిటి? మగేమిటి? హక్కులైనా, బాధ్యతలైనా ఇద్దరికీ సమానమే" అని వాదిస్తుంది శ్వేత.

వర్ధనమ్మ కూతురితో వాదించలేక ఊరుకుంటుంది. మంచి సంబంధం వస్తే అదే ఒప్పుకుంటుంది అని, తన ప్రయత్నాలేవో తాను చేస్తూనే ఉంది. ఈ సంబంధం అలా తెల్సినవారి ద్వారా వచ్చిందే. అబ్బాయి బుద్ధిమంతుడని, లెక్చరర్ అని అతని తల్లీ తండ్రి మంచీ మర్యాదా తెలిసినవారని తెలియబట్టే పెళ్ళిచూపులకు అంగీకరించింది.

శ్వేత అలంకారం పూర్తయినట్లుంది. తల్లి దగ్గరకు వచ్చి నిలుచుంది. టిఫిన్స్ ప్లేట్లలో సర్దిపెడుతున్న వర్ధనమ్మ కూతురి వంక పరిశీలనగా చూసింది. చిలకపచ్చరంగు బిన్నీ సిల్క్ చీరలో శ్వేత మరింత అందంగా మెరిసిపోతోంది. ఆమె అందమైన కళ్ళలో నునుసిగ్గులు దోబూచులాడుతున్నాయి. ఆమె నల్లని కురులలో మల్లెలు ఏమి మా అదృష్టమని మురిసిపోతున్నట్లున్నాయి. కూతురి అందచందాలు చూసి వర్ధనమ్మ మురిసిపోయింది. తన దిష్టే తగలగలదని తలచి చూపుమరల్చింది.

అన్న టైముకి పెళ్ళివారు రావడంతో పెళ్ళిచూపుల తతంగం పూర్తయింది. చక్కనిచుక్క శ్వేత అందరికీ నచ్చింది. అందానికి అందం, ఉద్యోగం, పైగా కట్నంగా ఇల్లు ఇస్తుండగా ఇక వారికి అభ్యంతరం చెప్పేందుకేమీ కనిపించలేదు. అన్నీ అంగీకారమయ్యాయనుకునేసరికి శ్వేత తన మనసులోమాట పెళ్ళివారి ముందు బైటపెట్టింది, తల్లి వద్దని వారిస్తున్నా వినకుండా.

శ్వేత నిబంధన విని పెళ్ళివారు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. వారికేం మాట్లాడాలో తెలియలేదు.

పెళ్ళికొడుకు అమిత్ కాస్త ఆలోచించి వర్ధనమ్మ అన్నట్లే అన్నాడు. "నా తల్లిదండ్రులను చూడవలసిన బాధ్యత నాది. నా భార్య అయ్యాక నీది కూడా. అంతేగానీ మీ అమ్మగార్ని మనం చూడటమేమిటి?" అని ఆశ్చర్యం వ్యక్తపరిచాడు.

"మా అమ్మకు నేను తప్ప ఎవరూ లేరు. ఈ చివరి దశలో ఆవిడను దిక్కులేనిదానిగా ఏ ఆశ్రమంలోనో వదిలేసి నేను హాయిగా ఎలా ఉండగలను? అందుకే ఆవిడ కూడా నాతో బాటు ఉంటుంది. దీనికి మీకు అంగీకారం అయితేనే మన పెళ్ళి జరుగుతుంది, లేకపోతే లేదని" శ్వేత ఖరాఖండిగా చెప్పేసింది.

"హక్కుల పోరాటం చేస్తున్నావా?" సీరియస్‌గా అన్నాడు అమిత్.

"మీరేమైనా అనుకోండి. నా తల్లి కూడా నాకు ముఖ్యమే" అంతే సీరియస్‌గా చెప్పింది సమాధానం.

"ఉద్యోగం చేస్తున్నానన్న ధీమానా ఇదంతా? పెళ్ళయ్యాక మానాల్సి వస్తే ఏం చేస్తావు?" అంటూ సూటిగా ప్రశ్నించాడు.

"మానే ప్రసక్తే లేదు. ఈ కాలంలో ఉద్యోగం పురుషలక్షణమే కాదు సర్వమానవ లక్షణం. అంతేకాదు మా ఆడవారికి ఈరోజుల్లో అవసరం కూడా" అంది ఆత్మవిశ్వాసంతో.

శ్వేత వ్యక్తిత్వం అతనికి ఎంతో నచ్చింది. చిరునవ్వు నవ్వుతూ "మీ మాటలు తప్పో ఒప్పో చెప్పలేనుగానీ మీ ఆత్మవిశ్వాసం, ధైర్యం, ముఖ్యంగా తల్లిపట్ల మీ అభిమానం నాకెంతో నచ్చాయి. మీ అందమేకాదు, మీ గుణమూ మెచ్చదగిందే" అన్నాడు ప్రసన్నంగా.

"థాంక్యూ! తల్లిదండ్రుల గురించి ఆలోచించే మీరూ బాధ్యతగల వ్యక్తిగా నాకు నచ్చారు. అలాగే నా బాధ్యతను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి" అంది నిదానంగా.

అమిత్ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా తలవూపి లేచాడు.

"ఆలోచించి ఏ విషయమూ లెటర్ వ్రాస్తామని" చెప్పి పెళ్ళివారు వెళ్ళిపోయారు.

ఈ పెళ్ళి జరగదనే నిర్ణయానికి వచ్చేసింది శ్వేత. బరువుగా నిట్టూర్చి ఫలహార ప్లేట్లను, గ్లాసులను తీసే పనిలో నిమగ్నమైంది.

"ఇలా అయితే నేను బ్రతికుండగా నీకు పెళ్ళి జరగదు. నీకీ మొండి పట్టేమిటే? నేడో రేపో రాలిపోయే నాకోసం మంచి సంబంధం వదులుకుంటున్నావని" కళ్ళనీళ్ళు పెట్టుకుంది వర్ధనమ్మ.

శ్వేత ఓదార్పుగా తల్లి భుజం మీద చెయ్యి వేసింది.

"నీకన్నా నాకు ఏదీ ఎక్కువ కాదమ్మా. నా చిన్నప్పుడే నాన్న పోయారు. నీ జీవితమంతా నాకోసమే ధారపోసావు. అలాంటి నీకోసం నేనీమాత్రం చేయాలనుకోవడం న్యాయమేనమ్మా" అంది తల్లిని అనునయిస్తూ.

★ ★ ★

రెండు రోజుల తరువాత అమిత్ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. "ఆలోచిస్తే మీ కోరిక న్యాయమేననిపించింది. ఇప్పుడు అన్ని రంగాలలోనూ ఆడ, మగ సమానమే. మీరు మీ బాధ్యతను నిర్వర్తించాలనుకోవడం సమంజసమే. మాకీ పెళ్ళి ఇష్టమే. మా అమ్మానాన్నల అంగీకారంతోనే ఈ లెటర్ వ్రాస్తున్నాను. మీ నిబంధనను ఒప్పుకుంటున్నాను. మరి మీకూ ఓకేనా" అంటూ వ్రాసాడు.

ఉత్తరం చదివిన శ్వేత సంతోషం అంతా ఇంతా కాదు. తల్లిని కౌగిలించుకుని ముద్దులు పెట్టింది.


వర్ధనమ్మకూ సంతోషం కలిగింది. శ్వేతని వదిలిపెట్టాలన్న బెంగ తీరి ఆవిడకు వేయి ఏనుగుల బలం వచ్చింది.

★ ★ ★

శ్వేత, అమిత్‌ల పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది. కాపురానికి వెళుతూ శ్వేత పట్టుపట్టి తల్లిని తనతో బయలుదేరదీసింది. ఇల్లు అద్దెకిచ్చేసారు అమిత్ తల్లీతండ్రి.

భర్త ప్రేమలో శ్వేతకు రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి. వర్ధనమ్మకూ కొన్ని రోజులు బాగానే గడిచినాయి. తర్వాత కొన్ని మార్పులు మొదలయ్యాయి.

నా బాధ్యత అంటూ శ్వేత తన పంతం నెరవేర్చుకుందిగానీ అది వర్ధనమ్మకు ఇబ్బందిగా పరిణమించింది. తన ఇంట్లో తనకు కావాల్సినంత స్వేచ్ఛగా ఉండేది. కాసేపు పని చేసినా, కాసేపు పడుకున్నా అభ్యంతరం చెప్పే వాళ్ళుండే వారు కాదు. ఇక్కడలా కుదరదు వాళ్ళేం అనుకుంటారో అనే



సంశయంతో ఓపిక ఉన్నా లేకపోయినా ఏదో ఒక పని కల్పించుకుని చేస్తోంది. వియ్యపురాలు మొదట్లో వద్దని మొహమాటంగా అన్నా తర్వాత నెమ్మదిగా ఇంటి బాధ్యతంతా వర్ధనమ్మకే అప్పగించేసి తను రెస్ట్ తీసుకోవడం ప్రారంభించింది. పైగా ఇంటికొచ్చినవారితో తానే కష్టపడిపోతున్నట్లుగా చెప్పడం, తన నెత్తినే కుంపటి మోస్తున్నట్లు బాధ వెళ్ళబోసుకోవడం రెండు, మూడుసార్లు వర్ధనమ్మ చెవినబడ్డాయి. ఇవన్నీ వింటూ అక్కడ ఉండటం ఆవిడకు ముళ్ళమీద ఉన్నట్లుగా ఉంది.

ఇంటి వాతావరణంలో క్రమంగా వస్తున్న మార్పులను శ్వేత కూడా గమనించింది. చాలా పనులు తనే పూర్తిచేసి తల్లికి కొంత శ్రమ తగ్గేలా చూస్తోంది. తల్లికి సాయంగా ఓ అమ్మాయిని కుదిర్చింది. కానీ అత్తగారు ఎవరినీ నాల్గురోజులు కూడా చేయనివ్వడం లేదు. నోటితో నవ్వుతూ, నొసటితో వెక్కిరించే ఆవిడ బుద్ధి శ్వేతకు అర్ధమైంది. భర్తకు చెబితే తననే అపార్థం చేసుకుంటాడేమో అని సంశయించింది.

'ఇవన్నీ ఊహించే అమ్మ ఆశ్రమంలో ఉంటానని వుంటుంది. నాకే అర్థం కాలేదు' అనుకుంది. ఇటువంటి సమస్యల్లో అమ్మ ఆరోగ్యం ఇంకా పాడౌతుందేమోనని భయం పట్టుకుంది శ్వేతకు.

తల్లిని తీసుకుని వేరే వెళ్ళిపోదామంటే ప్రాణప్రదంగా ప్రేమించే భర్తను వదిలి వెళ్ళలేకపోతోంది. అలాగని తల్లిపడ్తున్న ఇబ్బందిని చూస్తూ ఉండలేకపోతోంది.

ఈ సమస్యకు పరిష్కారం అర్థంకాక తన కొలీగ్ లతను ఏం చేయాలో చెప్పమని సలహా అడిగింది.


"మీ అమ్మగార్ని ఆశ్రమంలో చేర్పించడానికి నువ్వెందుకు విముఖత చూపిస్తున్నావో నాకు అర్థం కాలేదు శ్వేతా. అదేమీ తప్పు కాదు. అక్కడ వారి వయసువారితో గడుపుతుంటే వారికీ ఎంతో సంతోషంగా ఉంటుంది. ఇంట్లో లోన్లీగా గడవడం కంటే అందరితో కలిసి ఉంటే వారికి ఆరోగ్యమూ కుదుటపడ్తుంది. ఆశ్రమంలో ఉంచినంత మాత్రాన అనాథలుగా వదిలి వేసారని అందరు అనుకుంటారనుకోవడం చాలా తప్పు. పెద్ద వయసు వారిని ఇంట్లో ఉంచుకుని వారిని విసుక్కోవడం కన్నా వారిని ఆశ్రమంలో స్వేచ్ఛగా ఉండనివ్వడమే మంచిది. నా మాట విని మీ అమ్మగార్ని మంచి ఆశ్రమంలో ఉండే ఏర్పాటు చెయ్యి. వీలైనప్పుడల్లా నువ్వు వెళ్ళి చూస్తుండు. అంతేగానీ ఆవిడను బలవంతంగా మీ అత్తగారింట్లో ఉంచితే వాళ్ళ ప్రవర్తనతో ఆవిడ ఆరోగ్యం, అభిమానమూ దెబ్బతింటాయి. దానికన్నా ఇదే గౌరవం కదా" అంది లత.

లత చెప్పింది విని శ్వేతకూ అదే మంచిదనిపించింది. ఆశ్రమాల వివరాలు తెలుసుకుని స్వయంగా వెళ్ళి చూసి వచ్చింది. అక్కడ ప్రశాంత వాతావరణం, చీకూ చింతా లేకుండా వారు గడుపుతున్న జీవన విధానం శ్వేతకు ఎంతగానో నచ్చాయి. తల్లిని జాయిన్ చేయడానికి నిర్ణయించుకుని భర్తకు చెప్పింది.

అమిత్ మొదట అంగీకరించలేదు. శ్వేత వాదన విన్నాక "సరే నీ ఇష్టం, మీ అమ్మగారి ఇష్టం. మధ్యలో నాదేముంది. అక్కడ అంత బావుంటే మా అమ్మను కూడా చేర్పిద్దాం" అన్నాడు.

"వద్దులెండి. కోడలు వచ్చి ఆశ్రమానికి పంపేసిందన్న నింద నాకెందుకు?" అంది శ్వేత.

'పొమ్మనలేక పొగబెట్టిన పాపానికి ఆవిడ ప్రశాంతంగా ఉంటే ఎలా? ఇంటెడు పనీ చేసుకుంటూ ఇంట్లో పడి ఉండటమే ఆవిడకు పెద్ద శిక్ష' అని లోలోన అనుకుంది.



* * *

తల్లిని ఆశ్రమంలో విడిచి వస్తూ శ్వేత భోరున విలపించింది. కూతుర్ని ఓదార్చడం వర్ధనమ్మకు చాలా కష్టమయింది.

"హక్కులు బాధ్యతలు అన్నానుగానీ అవి ఆచరణలో అసాధ్యమని తేలిపోయిందమ్మా. ఆడవారికి ఆడవారే శత్రువులు. మగవారెంత మాత్రమూ కాదనిపిస్తోంది. స్త్రీని స్త్రీయే అర్థం చేసుకోలేదు. పైగా ఈర్ష్యతో అడ్డుపడుతుంది అని మా అత్తగార్ని చూసి తెలుసుకున్నాను. ఆడవారిని అంటి పెట్టుకున్న ఈ ఈర్ష్య అనే జాడ్యం పోనంతకాలం స్త్రీకి పూర్తి స్వేచ్ఛ రానట్లే" అని వాపోయింది శ్వేత.

"ఇవన్నీ నేను ముందు ఊహించినవే శ్వేతా. నేను చెబితే నువ్వు వినిపించుకోలేదు. నా గురించి ఆలోచించి నీ మనసు, కాపురమూ రెండూ పాడుచేసుకోకు. నేనెక్కడ ఉన్నా నువ్వు సుఖంగా సంతోషంగా ఉండటమే నాకు కావాల్సింది. నన్నిక్కడ చేర్పించి ఏదో తప్పు చేశానన్న భావన తొలగించుకో. ఇది నేను ఇష్టపడి ఎంచుకున్న మార్గం. నాకేమీ కష్టంగా లేదు. పైగా ఓ బందిఖానా నుంచి బైటపడ్డానన్నంత ఆనందంగా ఉంది" అని శ్వేతను ఓదార్చి పంపిస్తూ ఆమె వెళ్ళేవరకూ చూస్తూ ఉండిపోయింది వర్ధనమ్మ. ✤